సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



రిమ్స్‌లో అసౌకర్యాల 'తిష్ట'!

జిల్లా ప్రజలకు వైద్య వరప్రదాయినిగా పేరు పొందిన కడప జీజీహెచ్ (రిమ్స్) రోగులకు, వారి సహాయకుల పాలిట సౌకర్యాల కల్పనలో, వైద్య సేవలలోనూ నిర్లక్ష్యం కనిపిస్తోంది. - 8లో



ముగిసిన ఉరుసు ఉత్సవాలు

కమలాపురం పట్టణంలో వెలసిన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ దస్తగిరి షా ఖాద్రి ఉరుసు మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. - 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం 26.4 - 38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్



అంబేడ్కర్‌కు పుష్పాంజలి

నవభారత నిర్మాత అంబేడ్కర్

- నివాళులర్పించిన అధికారులు, నేతలు, స్వచ్ఛంద సంస్థలు
- కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు





అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు .. మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్, పలువురు నేతలు అభివర్ణించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్‌కు ఘన నివాళి అర్పించారు.

- కలెక్టరేట్ ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్‌తోపాటు జేసీ అదితి సింగ్, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్పందన హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితోపాటు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేశ్, జేసీ అదితిసింగ్, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. జిల్లాలో పునరుద్ధరణలో ఉన్న అంబేడ్కర్ భవన్ త్వరలో నిర్వహణలోకి తీసుకు రానున్నామన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ , జేసీ అదితిసింగ్ , సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతీ, మైనారిటీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వి.బ్రహ్మయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రెసిడెంట్ ఎస్. మల్లికార్జున, రాయలసీమ యాదవ కమ్యునిటీ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి. నారాయణ యాదవ్, రాయలసీమ దళిత, గిరిజన మానవ హక్కుల వేదిక అధ్యక్షులు జేవీ రమణ, చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, ఆర్‌పీఐ. లీగల్ సెల్ చైర్మన్, అడ్వకేట్ వై.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- ఎస్పీ కార్యాలయంలో..

కడప అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఎస్.పి అశోక్ కుమార్ పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ అంబేడ్కర్ సేవలను కొనియాడారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కడప కార్పొరేషన్: డాక్టర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఆయన విగ్రహానికి పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషాలతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు.జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అర్పించారు.

న్యూస్‌రీల్

16,17 తేదీల్లో పరీక్ష

కడప ఎడ్యుకేషన్: రాయచోటి డైట్ డిప్యూటేషన్ కోసం దరఖాస్తు చేసిన అర్హత కలిగిన ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులకు ఈ నెల 16,17 తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు రాయచోటి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌బాబు, వైఎస్సార్ జిల్లా డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. సంబంధిత పరీక్షను కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఉదయం 9 గంటల నుంచి ఉంటుందని వివరించారు. పరీక్షకు హాజరయ్యే ఉపాధ్యాయులు దరఖాస్తు ప్రతులు, గుర్తింపు కార్డులు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు డైట్ ప్రిన్సిపాల్ రాయచోటి, కడప డీఈఓ కార్యాలయం పనివేళల్లో కలవాలని డీఈఓ షంషుద్దీన్ తెలిపారు.

కార్మికులను తొలగించడం అన్యాయం



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

కడప కార్పొరేషన్ : నగర పాలక సంస్థలో 60 ఏళ్లు నిండిన కార్మికులను తొలగించడం అన్యాయమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు మనోహర్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ 40 ఏళ్ల నుండి పని చేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం వారిని పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, ఉన్న ఉద్యోగులను తొలగించడం సరికాదన్నారు. కార్మికులకు రూ. 26 వేలు ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులతో పాటు 62 సంవత్సరాలు పెంచి, రిటైర్మెంట్ డబ్బులు 3 లక్షలు ఇవ్వాలన్నారు. ఆరోగ్యం బాగా లేని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ అయిన వారిని అదనపు వర్కర్‌గా కొనసాగించాలన్నారు. అనంతరం అడిసినల్ కమిషనర్ రాకేష్ చంద్రకు వినతి పత్రం ఇచ్చారు.మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్, కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శులు ఆనంద రావు, బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : రాయచోటిలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో విహరించారు. సోమవారం రాత్రి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి, పల్లకీలో కొలువు దీర్చారు. ఆలయ ప్రాంగణం, మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు చేపట్టారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

– జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని ఒంటిమిట్ట మండలం నడింపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన ఏఆర్ కానిస్టేబుల్‌కు దగ్గరుండి మెరుగైన వైద్యమందించాలని ఎస్పీ అశోక్ కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. నడింపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలవ్వడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.ఎక్కడికక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్పీ అశోక్ కుమార్‌కు మంత్రి ఆదేశించారు.

భళా... ప్రభుత్వ కళాశాల!

- ఇంటర్ ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో చక్రాయపేట కాలేజ్ జిల్లాలో టాప్
- సెకండియర్ ఫలితాల్లో వేంపల్లి జూనియర్ కళాశాల ఫస్ట్ ప్లేస్





అన్ని గ్రూపుల్లో టాపర్స్‌ను నిలిపిన పులివెందుల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలు శభాష్ అనిపించాయి. కార్పొరేట్.. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఉత్తీర్ణత శాతంలో దూసుకెళ్లాయి. ఇటీవల విడుదలైన ఇంటర్- 2025 ఫలితాలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ఫలితాల పరంగా ప్రథమ సంవత్సరానికి సంబంధించి చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల 90.41 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో టాప్‌గా నిలువగా ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 23.38 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో చివరి స్థానంలో నిలిచింది. అలాగే ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వేంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల 97.30 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో టాప్‌గా నిలవగా కొండాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల 18.18 శాతం ఉత్తీర్ణతను సాధించి అట్టడుగులో ఉండిపోయింది.

పెరిగిన విద్యార్థులు.. ఫలితాల శాతం..

జిల్లాలో 2024 సంవత్సరం కంటే 2025లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతోపాటు ఉత్తీర్ణత శాతం కూడా పెరిగింది. 2024లో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1905 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 791 మంది పాస్ అయి 42 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 1455 మంది విద్యార్థులకు గాను 889 మంది పాసై 61 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే 2025 సంవత్సరానికి సంబంధించి 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2171 మంది విద్యార్థులకు గాను 1072 మంది పాసై 49 శాతం , ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 1640 మంది విద్యార్థులకు గాను 1149 మంది పాసై 70 శాతం ఉత్తీర్ణతను సాధించారు.

మరింత ఉత్తమ ఫలితాలను సాధించేందుకు...



ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో వచ్చే ఏడాది మరింత ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తాం. గతేడాది కంటే ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫలితాలు మెరుగయ్యాయి. ముఖ్యంగా నేను ప్రిన్సిపాల్‌గా పనిచేసే పులివెందుల గర్ల్స్ జూనియర్ కళాశాలల్లో అన్ని గ్రూపులకు చెందిన విద్యార్థులను టాపర్స్‌ను నిలిపాం. ముఖ్యంగా ప్రథమ సంవత్సరానికి సంబంధించిన హెచ్‌ఈసీలో సునిత అనే విద్యార్థిని 500లకు 485 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో సెకెండ్ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది.

– బండి వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐవో, ఇంటర్ విద్య

ఫస్టియర్..



జోష్న | హలిమాసాదియా | చైతన్య | సునీత

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న పలువురు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. ముఖ్యంగా ప్రథమ సంవత్సరానికి సంబంధించి పులివెందుల జీజేసీ గర్ల్స్ విద్యార్థినులు అన్ని గ్రూపుల్లోనూ జిల్లా టాపర్లుగా నిలవడం విశేషం. ఇందులో ఎంపీసీలో జోష్న 470కి 463 మార్కులు, బైపీసీలో హలీమా సాదియా 440కి 428 మార్కులు, సీఈసీలో చైతన్య 500కి 465 మార్కులు, హెచ్‌ఈసీలో సునీత 500కి 485 మార్కులు సాధించి జిల్లా టాపర్స్‌గా నిలిచారు.

సెకండియర్



శ్రీరాం | షారుణ్ | ఇఫ్రత్‌ఖానమ్ | వైజయంతి | షేక్ మున్నా

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఎర్రగుంట్ల జీజేసీ ఎంపీసీలో శ్రీరాం 1000 మార్కులకు 984 మార్కులు, మైలవరం జీజేసీ బైపీసీలో షారుణ్ 982 మార్కులు, కడప జీజేసీ గర్ల్స్ బైపీసీలో ఇఫ్రత్‌ఖానమ్ 982 మార్కులు, పులివెందుల జీజేసీలో షేక్ తహసీన్ బైపీసీలో 981 మార్కులు, పులివెందుల జీజేసీ గర్ల్స్‌లో వైజయంతి సీఈసీలో 968 మార్కులు, ప్రొద్దుటూరు జీజేసీ (ఉర్దూ) షేక్ మున్నా హెచ్‌ఈసీలో 942 మార్కులు సాధించి జిల్లా టాపర్స్‌లో నిలిచారు.

ప్రథమ సంవత్సర ఫలితాల వివరాలు

కళాశాల పేరు	పరీక్ష రాసిన విద్యార్థులు	పాస్ అయిన వారు	ఉత్తీర్ణత శాతం
చక్రాయపేట	47	44	90.41
తొండూరు	43	38	88.37
వేంపల్లి	55	46	83.64
లింగాల	67	55	82.09
వేముల	75	57	76.0
పులివెందుల	57	41	71.93
మైదుకూరు	26	16	61.54
పొద్దుటూరు	79	48	60.76
పులివెందుల	266	151	56.77
కడప	521	20	51.82
ఎర్రగుంట్ల	154	68	44.16
మైలవరం	34	12	35.29
జమ్మలమడుగు	106	23	35.23
పెండ్లిమర్రి	108	38	35.19
కడప	142	45	31.69
కొండాపురం	20	06	30.00
పోరుమామిళ్ల	118	33	27.97
జమ్మలమడుగు	106	25	23.58
పొద్దుటూరు	77	18	23.38
పులివెందుల	62	08	12.90
ద్వితీయ సంవత్సరానికి సంబంధించి			
వేంపల్లి	37	36	97.30
చక్రాయపేట	47	44	93.62
తొండూరు	47	44	93.62
లింగాల	49	45	91.84
ఎర్రగంట్ల	147	124	84.35
వేముల	19	16	84.21
పొద్దుటూరు	72	56	77.78
పొద్దుటూరు	33	25	75.76
పులివెందుల	256	189	73.83
కడప	407	300	73.71
పులివెందుల	36	25	69.44
మైదుకూరు	33	21	63.64
మైలవరం	21	13	61.90
పెండ్లిమర్రి	61	33	54.10
పోరుమామిళ్ల	63	34	53.97
జమ్మలమడుగు	59	31	52.54
కడప	91	47	51.65
పులివెందుల	75	25	33.33
కొండాపురం	11	02	18.18

ఒంటిమిట్టలో ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు దుర్మరణం
- మృతులు నంద్యాల వాసులుగా గుర్తింపు
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కడప డీఎస్పీ



విగతజీవులుగా పడి ఉన్న నంద్యాల యువకులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి సోమవారం నెత్తురోడింది. ముగ్గురు నంద్యాల వాసులు మృత్యువాత పడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి నుంచి ఏపీ31 సీడబ్ల్యూ 7479 నంబర్ గల స్కార్పియో వాహనం నంద్యాలకు వెళ్తోంది. తిరుపతి నుంచి ఏపీ 39 యూఎం 9771 నంబర్ గల ఏపీఎస్ ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు వస్తోంది. ఈ రెండు వాహనాలు మార్గం మధ్యలోని ఒంటిమిట్ట మండల పరిధి నడింపల్లి వద్ద ఉన్న కడప-చెన్నై జాతీయ రహదారిపై ఢీకొన్నాయి. దీంతో స్కార్పియో పల్టీ కొట్టి ఎలక్ట్రిక్ బస్సు వెనుక వస్తున్న పెట్రోలింగ్ వాహనాన్ని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కార్పియో వాహనంలో ఉన్న నలుగురిలో నంద్యాలలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఐటీఐ చేస్తున్న తేజ నాయుడు(21), నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం కొత్తపల్లికి చెందిన ధర్మారెడ్డి, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం సోమయాజుపల్లికి చెందిన జనరేటర్ మెకానిక్ వినోద్(25) అనే ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. కర్నూలులో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నంద్యాలలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన నిజాం సునీల్ నాయుడుకు తీవ్ర గాయాలు అయ్యాయి. పెట్రోలింగ్ వాహనం నడుపుతున్న రఘురాంరెడ్డి, అనే కానిస్టేబుల్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సీఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్ రెడ్డి ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. గాయపడిన వారిని 108 సాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన సమాచారాన్ని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లుకు చేరవేయడంతో ఆయన సంఘటనా స్థలానికి వచ్చారు. మృతదేహాలను పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని కడప ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి, రాజంపేట డిపో డీఎం రమణయ్య, కడప డిపో ఇన్‌చార్జి డీఎం కన్యాకుమారి, అలిపిరి డిపో డీఎం హరికృష్ణ పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు.

ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి

ఒంటిమిట్టలోని నడింపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతులకు సంతాపం తెలిపి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులకు మంత్రి సూచించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు.

సంఘటనా స్థలాన్ని చూస్తే ..రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సంఘటనా స్థలాన్ని కడప ఆర్టీసీ ఆర్ఎం పి. గోపాల్‌రెడ్డి పరిశీలించారు. అక్కడ ఉన్న పరిస్థితిని చూస్తే స్కార్పియో వాహనం నడిపిన వారిదే తప్పుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓవర్ స్పీడ్ మీద వచ్చి బస్సు మోటును కొట్టడంతో స్పీడ్ మీద తిరుగుకుంటూ వెళ్లి.. బస్సు వెనుక వైపు వస్తున్న పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టి ఉంటాడని తెలిపారు. పూర్తిగా తెలుసుకునేందుకు ఎలక్ట్రిక్ బస్సుకు ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తామని చెప్పారు.

నంద్యాలలో విషాదం

నంద్యాల : నంద్యాల జిల్లాకు చెందిన ముగ్గురు మృత్యువాత పడటంతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది. మహానంది పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సునీల్‌నాయుడు తన పెదనాన్న కుమారుడు తేజనాయుడు, స్నేహితులు ధర్మారెడ్డి, వినోద్‌లతో కలిసి తన బాబాయ్ అయిన హరినాయుడు పని కోసం ఆదివారం తిరుపతికి వెళ్లారు. హరినాయుడును అక్కడే వదిలేసి సోమవారం స్కార్పియో వాహనంలో తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.



తేజ నాయుడు(ఫైల్) | వినోద్ (ఫైల్)

కానిస్టేబుల్ సునీల్‌నాయుడుకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన ముగ్గురు మృతి చెందారు.

- చాగలమర్రి మండలం డి.కొత్తపల్లె గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి, అన్నమ్మల కుమారుడు ధర్మారెడ్డి నంద్యాలలోని జియో కంపెనీలో పని చేసేవాడు.
- బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లె గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ, వెంకటరాముడుల కుమారుడు వినోద్ టవర్ల వద్ద జనరేటర్ మెకానిక్‌గా పని చేసేవాడు.
- నంద్యాల హౌసింగ్ బోర్డుకు చెందిన భద్ర, రాజేశ్వరిల కుమారుడు తేజనాయుడు ఐటీఐ చదువుతున్నాడు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే బంధువులు ఘటనా స్థలానికి వెళ్లారు.

వైభవోపేతం.. చక్రస్నానం



స్వాముల వారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

- కమనీయంగా కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు
- వేడుకగా స్నపనతిరుమంజనం
- పుష్కరిణిలో భక్తుల పుణ్యస్నానాలు

ఒంటిమిట్ట : ఏకశిలానగరి కోదండ రాముడి బ్రహ్మోత్సవాల్లో చివరి అంకం చక్రస్నానం. తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు యజ్ఞంలా జరిగాయి. లక్షలాది మంది భక్తులు తరలివచ్చి జగదభిరాముని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు దశలో కీలకమైన చక్రస్నానాన్ని సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో సోమవారం ఉదయం సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం భక్తుల సర్వదర్శనానికి అనుమతిచ్చారు. సీతారామలక్ష్మణ దివ్య మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. 9:30 గంటలకు సుదర్శన చక్రత్తాళ్వర్ పల్లకీలో.. ఆలయం ఎదురుగా నిర్మించిన నూతన పుష్కరిణికి శోభాయాత్ర ప్రారంభమైంది. మార్గంమధ్యలో కోలాట నృత్యాలు, కేరళ వాయిద్యాలతో సందడి నెలకొంది. 09:30 నుంచి 10:30 గంటల వరకు సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులకు ఉత్సవ కంకణదారు రాజేష్ ఆధ్వర్యంలో స్నపనతిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణుల సరసన చక్రత్తాళ్వార్‌కు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనాలతో అభిషేకాలు చేశారు. 10:30 నుంచి 11:00 గంటల వరకు అర్చకులు వేద మంత్రోచ్చారణతో చక్రస్నాన కార్యక్రమాన్ని కమనీయంగా నిర్వహించారు. టీటీడీ అధికారులు, ఉద్యోగులు సిబ్బంది, కళాకారులు, భక్తులు పుణ్యస్నానాలు చేశారు. పుష్కరిణి నుంచి ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. ఇంటి ఇలవేల్పు ముంగిట్లోకి రావడంతో.. భక్తులు కాయా, కర్పూరం సమర్పించి హారతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం


మంగపట్నం పవన్ (ఫైల్)

జమ్మలమడుగు : మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన మంగపట్నం పవన్ అదృశ్యమైనట్లు మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగపట్నం పవన్ జమ్మలమడుగు పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ సీఈసీ చదువుతున్నాడు. అయితే ఈనెల 12వతేదీ మధ్యాహ్నం కాలేజీ ఫీజు కట్టేందుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిపోయాడు. ఇంత వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో విద్యార్థి తండ్రి లింగమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ ఆసుపత్రి సమీపంలో గత నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యకిత రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రిమ్స్ పోలీసుల కథనం మేరకు.. వీరపునాయునిపల్లి మండలం పాలగిరి గ్రామానికి చెందిన మల్లెం కొండ జగదీష్ (42) కడప జెడ్పీ ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌లో పని చేసేవాడు. అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై గత నెల 27న రిమ్స్ ఆసుపత్రి సమీపంలో పురుగుల మందు తాగాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతిచెందిన ఖాదర్‌వలీ

కలసపాడు : ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం ముండ్లపాడు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని ఎగువ రామాపురం గ్రామానికి చెందిన షేక్‌ఖాదర్‌వలీ (62) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కార్పెంటర్ పని చేసుకుని జీవిస్తున్న ఖాదర్‌వలీ తన సొంత పని నిమిత్తం గిద్దలూరుకు వెళ్లి పని ముగించుకుని బైక్‌లో వస్తుండగా ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం ముండ్లపాడు పెట్రోలు బంకు వద్ద గిద్దలూరుకు వెళుతున్న యువకుల బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య బషీరున్, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రిమ్స్‌లో 'అసౌకర్యాల 'తిష్ట'!


కడప జీజీహెచ్(రిమ్స్) ఓపీ విభాగం


రిమ్స్ ఓపీలో వందలాది మంది రోగులు గుమికూడిన దృశ్యం

- ఓపీ విభాగంలో అరకొర సిబ్బంది.. సమయపాలన నిల్!
- ఇ– హాస్పిటల్ విధివిధానాలకు తూట్లు
- సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షలకు సైతం అక్రమ వసూళ్లు
- దాహార్తితో ఇబ్బందులు పడుతున్న రోగులు, సహాయకులు
- ఓపీ క్యాంటీన్‌ను బలవంతంగా మూసి వేయించిన అధికారులు


రిమ్స్ ఓపీ చీటీలు ఇచ్చే కౌంటర్‌లో విధులను నిర్వహిస్తున్న ఇద్దరే ఇద్దరు


కార్పొరేషన్ నుంచి వచ్చే నీటి సరఫరా లేక వెక్కిరిస్తున్న పైపులైను, సంప్

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : జిల్లా ప్రజలకు వైద్య వరప్రదాయినిగా పేరు పొందిన కడప జీజీహెచ్ (రిమ్స్) రోగులకు, వారి సహాయకుల పాలిట సౌకర్యాల కల్పనలోనూ, అందించాల్సిన వైద్య సేవలలోనూ నిర్లక్ష్యం కనిపిస్తోంది. కడప రిమ్స్‌లో ప్రతి రోజూ ఓపీ సమయం 9 గంటలకు ప్రారంభం కాకమునుపే అక్కడ వైద్య సేవలను పొందేందుకు వస్తున్న రోగులకు, వారి సహాయకులకు ఓపీ చీటీలను అందించాల్సిన అవసరం ఉంది. ఓపీ చీటీలను తీసుకునే ముందు ప్రస్తుతం కుటుంబంలోని సభ్యులంతా తమతమ 'ఆండ్రాయిడ్'ఫోన్‌ల ద్వారా రిజిస్టర్ చేయించుకునే ప్రక్రియ 'ఏబిహెచ్‌ఏ'ను చేయించుకుంటున్నారు. ఈ ప్రక్రియను ప్రతి రోజూ అక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది లేదా వివిధ కేటగిరిల వైద్య విద్య అభ్యసించే విద్యార్థులచేత నిర్వహించేవారు. ఈ ప్రక్రియను సోమవారం ప్రత్యేకంగా సెక్యూరిటీ, మహిళా సెక్యూరిటీ సిబ్బందిచేత నిర్వహింపచేశారు. ఓపీ విభాగంలోని కౌంటర్‌లో ఉదయం 9:12 నిమిషాలైనా కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే విధులను నిర్వహిస్తున్నారు. రోగులు, వారి సహాయకులు క్యూలైన్‌లలో గంటల తరబడి వేచి వుండటంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

■ జీజీహెచ్ (రిమ్స్)కు వైద్య పరీక్షలకు వస్తున్న రోగులకు వైద్య పరీక్షలతో పాటు ఎక్స్‌రే, సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ సేవలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలే కొందరు 'చిరుద్యోగుల పాలిట' వరంగా మారుతున్నాయి. సిటీస్కానింగ్, ఎంఆర్ఐ పరీక్షలకు తమను సంప్రదిస్తున్న వారి పరిస్థితిని బట్టి రూ.1000 నుంచి 2000లను అక్షరాలా ముక్కు పిండి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

■ వేసవి కాలంలో రిమ్స్ ఐపీ,ఓపీ విభాగాలకు మధ్యన ఉన్న ఒకే ఒక్క 'చలివేంద్రం'ఎంతమంది దాహార్తిని తీర్చగలదని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు రిమ్స్ ఓపీ విభాగంలోని 'క్యాంటీన్'ను బలవంతంగా మూయించిన అధికారులు మాత్రం మరలా టెండర్ నోటిఫికేషన్ ద్వారా గానీ, లేదా జిల్లా కలెక్టర్ అనుమతితో గానీ తిరిగి ప్రారంభించకుండా 'మీన మేషాలు'లెక్కిస్తున్నారు. మరోవైపు సందిట్లో సడేమియా మాదిరిగానే ఐపీ విభాగం ముందు ఉన్న కొందరు క్యాంటీన్ నిర్వాహకులు యథేచ్ఛగా నీటి వ్యాపారం కొనసాగిస్తున్నారు. మరోవైపు ఓపీ, ఐపీ విభాగాలకు, రిమ్స్ అవసరాలకు కార్పొరేషన్ నుంచి ప్రతి రోజూ 'లక్ష గ్యాలన్'ల నీటిని సరఫరా చేయాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే కార్పొరేషన్ సంస్థకు, రిమ్స్‌కు ఒప్పందం కుదిరింది. కమిషనర్‌లు మారుతున్నారే తప్ప రిమ్స్ అవసరాలకు నీళ్లు మాత్రం సరఫరా కావడం లేదని, కనీసం నాలుగు రోజులకు ఒక సారైనా నీళ్లు రావడం లేదని వాపోతున్నారు.

■ మరోవైపు బోర్ల ద్వారా వచ్చిన నీటిలో 'ఫ్లోరైడ్' ఎక్కువ శాతం వుండటంతో వార్డులకు, ఓపీ విభాగాలలోని టాయిలెట్స్‌కు, వాష్ బేసిన్‌లకు, ఇతర అవసరాలకు వచ్చే నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ఏది ఏమైనా నీటి సౌకర్యం, ప్రజల దాహార్తి రోజురోజుకు శాపంగా మారుతోంది. ఇప్పటికైనా రిమ్స్ వైద్య సిబ్బందికి, ప్రజలకు ఉపయోగపడేలా 'ఆర్.ఓ.ప్లాంట్'లను ఏర్పాటు చేయాలని, లేకుంటే, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి 'చలివేంద్రాలు'ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లారీలకు గ్రీన్ ట్యాక్స్ తగ్గించకుంటే సమ్మె చేస్తాం


మాట్లాడుతున్న నమ్‌తా జనరల్ సెక్రటరి టీవీ చలపతి

ప్రొద్దుటూరు క్రైం : లారీలపై వేస్తున్న గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించకుంటే సమ్మె చేయడానికైనా వెనుకాడేది లేదని ఏపీ న్యూ ఆంధ్రా మోటార్, ట్రక్కర్స్ అసోసియేషన్ (నమ్‌తా) జనరల్ సెక్రటరి టీవీ చలపతి తెలిపారు. స్థానిక లింగాపురంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం లారీ ఓనర్లు, డ్రైవర్లకు రవాణా చట్టాలు, సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీరో ఆక్సిడెంట్ సమాజం కోసం అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలపై గతంలో అనేక మార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చామన్నారు. టోల్ ట్యాక్స్, ఇన్సూరెన్స్ ప్రీమియం, గ్రీన్ ట్యాక్స్ పేరుతో విపరీతంగా డబ్బు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పక్క రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ట్యాక్స్‌ను బేరీజు వేసుకొని సాధ్యమైనంత వరకు వీటిని తగ్గించాలనేది తమ ప్రధాన డిమాండ్ అన్నారు. ఓవర్‌లోడ్, ఓవర్ హైట్ కేసులకు వాహనదారుడిని మాత్రమే కాకుండా సరుకు యజమానిని కూడా బాధ్యుడని చేయాలన్నారు. జాతీయ రహదారుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు.

సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలి

తెలుగు రాష్ట్రాల మధ్య సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలని నమ్‌తా జాయింట్ సెక్రటరి శేషగిరి కోరారు. రాష్ట్రం విడిపోయినప్పుడు చంద్రబాబు ప్రభుత్వమే అధికారంలో ఉందని, ప్రస్తుతం ఏపీలో ఆ ప్రభుత్వమే ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నమ్‌తా అధ్యక్షుడు పీజేఆర్ఎస్ మహారథి, ప్రొద్దుటూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శివారెడ్డి, నాగేశ్వరరెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆటో నిలుపుదల స్థలం కోసం ఘర్షణ

ఆరుగురికి తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మేకలబాలయపల్లి గ్రామంలో ఆటో నిలుపుదల చేసుకునే స్థలం విషయమై సాయిరాం, రమేష్‌ల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ మరింత ముదిరి ఆదివారం అర్ధరాత్రి సాయిరాం ఇంటిపైకి రమేష్ , సురేష్‌లతో పాటు మరికొంత మంది కలసి దాడి చేసి ఆరుగురిని తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష్, సురేష్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు కలమల్ల పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మేకలబాలయపల్లి గ్రామానికి చెందిన సాయిరాం, రమేష్, సురేష్‌ల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. అయితే వీరి మధ్య ఆటో నిలుపుదల స్థలంపై ఆదివారం ఘర్షణ జరిగింది. అయితే అర్ధరాత్రి రమేష్, సురేష్‌లతో పాటు మరి కొందరు కలసి కర్రలు తీసుకుని సాయిరాం ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో సాయిరాం, జయరాం, రామచంద్రుడు, రామదేవి, నాగవేణి, తేజ్‌రాంలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు రామచంద్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష, సురేష్‌లతో పాటు మరి కొందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు కలమల్ల పోలీసులు తెలిపారు.

ఆటో చోరీ

కడప అర్బన్ : కడప చిన్నచౌకు పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకరాపురంలో పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైంది. మాసాపేటకు చెందిన నాగభూషణం అనే వ్యక్తి శంకరాపురంలో తన బంధువుల ఇంటి వద్ద ఆదివారం రాత్రి ఆటోను పెట్టి అక్కడే పడుకున్నాడు. తెల్లవారే సరికి ఆటో కనిపించలేదు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్యాసింజర్ రైళ్లు తాత్కాలిక రద్దు

- పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు దారి మళ్లింపు

కలికిరి : తిరుపతి నుంచి పాకాల, ధర్మవరం మీదు గా గుంతకల్, కదిరిదేవరపల్లి వరకు నడిచే ప్యాసింజర్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మవరం జంక్షన్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల కారణంగా 35 రోజుల పాటు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారు. అలాగే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దుతో పాటు, కదిరి, మదనపల్లి రోడ్, పీలేరు, పాకాల మీదుగా నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారిమళ్లించారు.

వాటి వివరాలు ఇలా ఉన్నాయి

తిరుపతి – గుంతకల్ ప్యాసింజర్(57403) మే నెల 18వ తేదీ వరకు, గుంతకల్ – తిరుపతి ప్యాసింజర్(57404) మే నెల 19వ తేదీ వరకు, తిరుపతి – కదిరిదేవరపల్లి ప్యాసింజర్(57405) మే నెల 16వ తేదీ వరకు, కదిరిదేవరపల్లి – తిరుపతి ప్యాసింజర్(57406) మే నెల 17వ తేదీ వరకు రద్దయ్యాయి. అలాగే తిరుపతి-అమరావతి ఎక్స్‌ప్రెస్(12765) మే నెల 6,10,13,17 తేదీలలో రద్దు చేశారు. అమరావతి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (12766) మే నెల 5,8,12,15 తేదీలలో రద్దు చేశారు.

దారి మళ్లింపు ఇలా..

తిరుపతి-ఆకోలా వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్(07605) పాకాల, పీలేరు, ధర్మవరం మీదుగా కాకుండా మే నెల 9, 16 తేదీలో తిరుపతి నుంచి రేణిగుంట, గుత్తి మీదుగా దారి మళ్లించారు. ఆకోలా-తిరుపతి వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్(07606) ధర్మవరం, కదిరి, పీలేరు, పాకాల మీదుగా కాకుండా మే నెల 4, 11 తేదీలలో గుత్తి, రేణిగుంట మీదుగా తిరుపతికి దారి మళ్లించారు. తిరుపతి-సికింద్రాబాద్ సెవెన్‌హిల్స్(12769) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 5, 9, 12, 16 తేదీలలో పాకాల, పీలేరు, కలికిరి, కదిరి, ధర్మవరం మీదుగా కాకుండా తిరుపతి నుంచి రేణిగుంట, కడప, గుత్తి మీదుగా, అలాగే సికింద్రాబాద్-తిరుపతి సెవెన్‌హిల్స్(12770) వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 6, 9, 13, 16 తేదీలలో గుత్తి నుంచి కడప, రేణిగుంట మీదుగా తిరుపతి రూట్‌కు మార్చారు. పాకాల, కలికిరి, కదిరి మీదుగా నడిచే తిరుపతి-సికింద్రాబాద్(12731) సూపర్ ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ను మే నెల 8, 11, 15 తేదీలలో తిరుపతి నుంచి రేణిగుంట, కడప, గుత్తి మీదుగానూ, ధర్మవరం నుంచి కదిరి, కలికిరి, పీలేరు మీదుగా నడిచే సికింద్రాబాద్-తిరుపతి(12732) సూపర్ ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ను మే నెల 7, 10, 14 తేదీలలో గుత్తి, కడప, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుకుంటుంది. పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్ కదిరి మీదుగా నడిచే మధురై-కాచిగూడ(07192) స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ మే నెల 5, 12 తేదీలలో గుత్తి, కడప, రేణిగుంట, తిరుపతి, పాకాల మీదుగానూ, కాచిగూడ-మధురై(07191)స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ మే నెల 7, 14 తేదీలలో పాకాల నుంచి తిరుపతి, రేణిగుంట, కడప, గుత్తి మీదుగానూ దారి మళ్లించారు. పాకాల, పీలేరు, ధర్మవరం మీదుగా నడిచే నాగర్‌కోయిల్-ముంబై(16340) ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 5, 6, 7, 9, 12, 13, 14, 16 తేదీలలో పాకాల నుంచి తిరుపతి, రేణిగుంట, కడప, గుత్తి మీదుగా, ముంబై-నాగర్‌కోయిల్(16339)ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 6, 7, 8,10,13, 14, 15 తేదీలలో గుత్తి నుంచి కడప, రేణిగుంట, తిరుపతి, పాకాల మీదుగా మళ్లించారు. మధురై-కాచిగూడ(22716) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 04, 11 తేదీలో పాకాల నుంచి తిరుపతి, రేణిగుంట, డోన్, గుత్తి మీదుగానూ, కాచిగూడ-మధురై(22715) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను మే నెల 10,17 తేదీలలో డోన్, రేణిగుంట, తిరుపతి, పాకాల మీదుగా దారి మళ్లించారు. ధర్మవరం నుంచి రోజు నడిచే ధర్మవరం-నరసాపూర్(17248) ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి కదిరి నుంచి మాత్రమే ప్రారంభమవుతుంది. అలాగే నరసాపూర్-ధర్మవరం(17247) ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం నుంచి కదిరి వరకు మాత్రమే నడపనున్నారు. ఈ మేరకు ప్రయాణికులు గమనించాలని అధికారులు కోరారు. కాగా గత ఏడాది డిసెంబరు 28 నుంచి మహాకుంభమేళా కోసం గుంతకల్-తిరుపతి ప్యాసింజర్ రైళ్లను సుమారు రెండు నెలలకు పైగా రద్దు చేసిన విషయం తెలిసిందే. మళ్లీ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 1 నుంచి ప్రారంభించారు. ఇప్పుడు ధర్మవరం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కోసం నెల రోజులకు పైగా ప్యాసిజర్ రైళ్లను పూర్తిగా రద్దు చేయడంతో రైల్వే ప్రయాణికులపై మరో పిడుగు పడ్డట్లైంది.

అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న కూటమి ప్రభుత్వం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

మైదుకూరు : అంబేడ్కర్ ఆశయాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్ ధ్వజమెత్తారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తూ బలవంతంగా పాఠశాలలను విలీనం చేస్తోందని ఆరోపించారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే ఈ విలీనాలను ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తెలుగు మీడియం కనుమరుగై పోయిందని పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సీఐటీయూ నాయకుడు షరీఫ్, ఆవాజ్ నాయకుడు ఖాదర్‌బాషా, ఎమ్మార్పీఎస్ నాయకుడు జీవన్ తదితరులు మద్దతు ప్రకటించారు. యూటీఎఫ్ నాయకులు గంగులయ్య, వనమాల రాము, రామకృష్ణ, తిరుపాలయ్య, లక్కినేని బాబు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'తహలిల్' తో ముగిసిన ఉరుసు ఉత్సవాలు


తహలిల్ ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు, భక్తులు

కమలాపురం : పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ దస్తగిరి షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఉరుసు మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 11వ తేదీ నుంచి దర్గా పీఠాధిపతి (ముతవల్లి) సజ్జాద్-ఏ-నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో, దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాలు సోమవారం తహలిల్ కార్యక్రమంతో ముగిశాయి. ఉదయం స్థానిక పాత బస్టాండు సమీపంలోని గంధం ఇంటి నుంచి పీఠాధిపతి ఆధ్వర్యంలో పూలచాదర్ తదితర వాటిని ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. అనంతరం దర్గాలో వెలసి ఉన్న స్వాముల వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం నషాన్ రోజున దర్గా ఆవరణంలో ఆవిష్కరించిన జెండాను తొలగించారు. దీంతో ఉరుసు మహోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి, మౌలానా ఖాద్రి, గౌస్ పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, పెద్ద సంఖ్యలో భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. కాగా భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆశా వర్కర్ల వేతనం పెంపును అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ప్రకటించిన ఆశాల వేతన పెంపును అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి కోరారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను భర్తీ చేసి పని భారం, యాప్‌లు తగ్గించి ఆశాల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. మే ఒకటో తేదీన మే డే సందర్భంగా అన్ని నియోజకవర్గ కేంద్రాలలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి కోర్కెల దినాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు పి. సుబ్బరాయుడు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కల్పన, అధ్యక్షురాలు మరియమ్మ, ఉప ప్రధాన కార్యదర్శి బి. శాంతమ్మ, కోశాధికారి సి.అమ్ములు, అనిత, సుజాత, శోభారాణి, ప్రియదర్శిని, భారతి, నాగలక్ష్మి, మున్ని, లక్ష్మీకాంతమ్మ, పార్వతి పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయం

జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి


అగ్నిప్రమాదాల నివారణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీలక్ష్మి తదితరులు

కడప అర్బన్ : అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమని జిల్లా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం కడప ఫైర్ స్టేషన్‌లో ఘనంగా ప్రారంభించారు. అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. అగ్ని ప్రమాదంలో అమరులైన అగ్నిమాపక వీర జవానులను స్మరించుకుని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది చెప్పే సూచనలు పాటించడం వలన ప్రజలు తమ విలువైన ఆస్తులు, ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి ఐ. ధర్మారావు, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి, కడప ఫైర్ స్టేషన్ అధికారి బసివిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడప కేంద్ర కారాగారం జైలర్ అమర్‌బాషా, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకుంటే ఆందోళనలు ఉధృతం


ఫ్లైఓవర్ పనుల వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బద్వేలు అర్బన్ : ఎన్‌హెచ్–67 రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గుంతపల్లె గ్రామ సమీపంలో నిర్మించిన ఫ్లైఓవర్ కింది భాగంలో ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్లు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో సమీప గ్రామ ప్రజలను కలుపుకుని ఆందోళనలను ఉధృతం చేస్తామని సోమవారం గుంతపల్లె గ్రామస్తులు, సమీప గ్రామాల రైతులు ఫ్లైఓవర్ సమీపంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డి.ప్రసాద్, రామచంద్రయ్య మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గ్రామ సమీపంలో ఫ్లైఓవర్ నిర్మాణం మొదలు పెట్టిన సమయంలో రైతులతో కలిసి ఆందోళన నిర్వహిస్తే ఫ్లైఓవర్ పూర్తి కాగానే సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పిన నేషనల్ హైవే అధికారులు, కాంట్రాక్టర్లు ఫ్లైఓవర్ పూర్తయ్యే సమయానికి సర్వీసు రోడ్డు విషయం మా చేతుల్లో లేదని చేతులెత్తేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

వడగండ్ల వాన

సింహాద్రిపురం : మండలంలోని అహోబిలం గ్రామంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. అలాగే నక్కలపల్లె, బలపనూరు, అంకాలమ్మ గూడూరు గ్రామాల్లో కూడా వర్షం కురిసింది. వర్షానికి అహోబిలం గ్రామంలోని రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి శివశంకర్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న 50 ఏళ్ల వేపచెట్టు నేల కూలింది. గ్రామంలో కొన్ని చోట్ల భారీ ఈదురుగాలులకు అరటి చెట్లు నేలకొరిగాయి. కొన్ని గ్రామాల్లో చినుకు జాడే లేదు.


బలపనూరులో కురుస్తున్న వర్షం


అహోబిలంలో నేలకూలిన వేప చెట్టు

ఈదురు గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న


ఈదురు గాలులకు నేలవాలిన మొక్కజొన్న

కొండాపురం : మండలంలో వెంకయ్యకాలువ, బ్రాహ్మణపల్లె తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులకు మొక్కజొన్న కోత దశలో నేలకొరిగింది. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం వరకు భగభగలాడిన సూర్యుడు సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీయడంతోపాటు చిరు జల్లులు కురిశాయి. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మొక్కజొన్న పంట కోత దశలో నేల వాలడంతో కోత మిషన్ ఆడించేందుకు వీలులేకుండా పోతోందన్నారు. దీంతో కూలీల ఖర్చులు పెరిగి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పట్లలో పిడుగు పాటు


టెంకాయ చెట్టుపై పిడుగు పడిన దృశ్యం

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలోని వరదరాజులరెడ్డి ఇంటి ఆవరణంలో ఉన్న టెంకాయ చెట్టుపై సోమవారం సాయంత్రం పిడుగు పడింది. పిడుగు పాటుకు టెంకాయ చెట్టు కాలిపోయింది. ఆ నిప్పు రవ్వలు సమీపంలో అరటి పంటకు వ్యాపించడంతో గ్రామ స్తులు అప్రమత్తమై మంటలను అదుపు చేశా రు. పిడుగు పాటుతో ఎవరికి ఎలాంటి ప్రమా దం సంభవించలేదని గ్రామస్తులు తెలిపారు.